క్లుప్తంగా

ఓపెన్ స్కూల్.. ఓ మంచి అవకాశం



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పాపారావు

కొణిజర్ల: విద్య ద్వారా ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగోన్నతులు, ఉన్నత చదువులు అవసరమైన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఓ మంచి అవకాశమని ఓపెన్ స్కూల్ విద్యాపీఠం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. ఆదివారం మండలంలోని తనికెళ్లలో గల గ్రేస్ ఓపెన్ స్కూల్‌లో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్ తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యాసకులతో మాట్లాడారు. రెగ్యులర్ కోర్సులతో సమానమైన విలువ కలిగిన ఓపెన్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీవేణు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.కృష్ణయ్య, అధ్యాపకులు చంద్రబాబు, పుల్లారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సత్తుపల్లి యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని కలిసి వారి సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. తమకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ మాత్రమే రూ.1,000 నుంచి రూ.3వేల వరకు వస్తుందని, తమకు ఆరు గ్యారంటీలు వర్తించేటట్లు, ఇళ్లు లేని వారికి, తెల్లకార్డులు ఇప్పించాలని కోరారు. సంఘం కార్యదర్శి ఆర్‌వి కుమార్, అధ్యక్షులు ఎల్ఎస్ రెడ్డి, దాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం శ్రీనివాసరావు ఉన్నారు.

వైరా లయన్స్‌క్లబ్ వితరణ



రూ.50 వేలు నగదు అందజేస్తున్న వీడీజీ మధు

వైరా: జిల్లా లయన్స్‌క్లబ్‌లో జరిగే సేవా కార్యక్రమాల నిమిత్తం వైరా లయన్స్‌క్లబ్ వారి తరుపున డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్-2 నంబూరి మధు రూ.50 వేలు జిల్లా గవర్నర్ సీహెచ్ వి.ప్రసాద్‌కు అందజేశారు. ఆదివారం ఖమ్మంలోని కావేరి రెస్టారెంట్‌లో నిర్వహించిన క్లబ్ జిల్లా క్యాబినెట్ మీటింగ్‌లో ఆయన నగదును అందజేశారు. లయన్స్‌క్లబ్ వైరా సేవా కార్యక్రమాలలో ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. గత ఏడాది 465 సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఇంటర్నేషనల్ స్థాయిలో ఎక్సలెన్సీ అవార్డును మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు అందుకున్నారు. మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు, పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, ప్రభాకర్, పి.ఉపేందర్‌రావు, వాసు, సత్యంబాబు, బుచ్చి రామారావు, రామకృష్ణ, పాల్గొన్నారు.

హమాలీ పని కల్పించాలి



రైల్వేస్టేషన్ మాస్టర్ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చింతకాని: పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న గోడౌన్‌లో చుట్టుపక్కల గ్రామాల వారికి హమాలీ పని కల్పించాలని పందిళ్లపల్లి స్టేషన్ మాస్టర్ సురేష్‌కు సీఐటీయూ నాయకులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హమాలీల రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శ్రీను మాట్లాడుతూ.. రైల్వే గోడౌన్‌లో పనిచేసేందుకు స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహారావు, వీరబాబు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చలమయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లోని ఒక ఇంట్లో పలువురు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ తన సిబ్బందితో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆ ఇంట్లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకోడంతో పాటు వారి వద్ద నుంచి రూ.57 వేల నగదుతో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో రాజకీయ ప్రముఖులు, ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

కేసు నమోదు

కారేపల్లి: మేకల చోరీ విషయమై.. కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని షైల్‌తండా గ్రామానికి చెందిన అజ్మీర తారాచంద్ మేకలదొడ్లోకి ఈ నెల 23వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి 4మేకలను ఎత్తుకెళ్లారు. దీనికి సంబంధించి బాధితుడు అజ్మీర తారాచంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై ఎస్.రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె గొంతెండుతోంది !

- వేసవికి ముందే పల్లెల్లో తాగునీటి కష్టాలు
- సక్రమంగా అందని మిషన్ భగీరథ నీళ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

వేంసూరు: పల్లెల్లో వేసవికి ముందే ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీరు ఒకరోజు వస్తే రెండు రోజులు అందడంలేదు. వేసవికి ముందే పరిస్థితి ఇలా ఉంటే వేసవి ఏలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు మండల ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీరు సరఫరా ఇలా..

వేంసూరు మండలంలో 58 వాటర్ ట్యాంకులు ఉండగా అమ్మపాలెం, రేపల్లెవాడ, భరణిపాడు, దిద్దుపూడిలో గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు మిషన్ భగీరథ పథకం ప్రారంభం నుంచి నేటి వరకు చుక్క నీరు కూడా అందించడంలేదు. మిగిలిన 54 వాటర్ ట్యాంకులకు సైతం అరకొరగా నీళ్లు అందిస్తున్నారు. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోటర్ల ద్వారా ట్యాంకులు నింపుతూ ప్రజలకు తాగునీరు అందిచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడంకపోవడంతో ప్రజలు చేతి పంపులను ఆశ్రయిస్తున్నారు.

ప్రజలకు అందని భగీరథ నీళ్లు..

గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీళ్లు పల్లె ప్రజలకు అందడంలేదు. ప్రతీ రోజు ఎక్కడో ఒకచోట లీకేజీతో వేసవికి ముందే ప్రజలు నీళ్లకోసం ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

మిషన్ భగీరథ సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడటంతో వారు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తు తాగునీటి సమస్యకు కారణం అవుతున్నారు. మండలంలో 14 మంది మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నా.. వాటర్ ట్యాంకుల నింపటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సగం ట్యాంక్ నింపి వెళుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో పంచాయతీ మోటర్లే దిక్కయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఇక వేసవిలో మా పరిస్థితి అంతే.. పలుమార్లు మండల స్థాయి సమావేశాల్లో ప్రజాప్రతినిధులు మిషన్ భగీరథ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినా వారి తీరులో మాత్రం మార్పు రావడంలేదు. కనీసం ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నీళ్లకు చాలా ఇబ్బందిగా ఉంది..



మా గ్రామంలో నీళ్లకు చాలా ఇబ్బంది ఉంది. నీటి సమస్యను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. చేతి పంపులు సైతం పనిచేయడం లేదు. నీటి అవసరాల కోసం వ్యవసాయ మోటర్ల నుంచి ట్యాంకర్లతో నీటి తీసుకొచ్చి వాడుతున్నాం.

– గుంట్రు వెంకట రామారావు, కల్లూరుగూడెం

వ్యవసాయ బోర్లే దిక్కు..



మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా అందకపోవడంతో వ్యవసాయ బోర్లే దిక్కుగా మారాయి. వేసవికి ముందే తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులను అడిగితే ప్రతిరోజు లీకుల పేరు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భగీరథ నీరు వచ్చేటట్లు చూడాలి.

– జమలయ్య, చౌదవరం

పట్టుదలతో చదివి.. ఆదర్శంగా నిలవాలి



ఆశ్రమ పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీడీ విజయలక్ష్మి

కొణిజర్ల: పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధించలేనిదేమి లేదని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి పేర్కొన్నారు. పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దన్నారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలురు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏసీఎంఓ డి.నాగేశ్వరరావు పదిలో 10 జీపీఏ సాధించిన బాలురకు రూ.1,116లు బహుమతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమ్లా, ఉపాధ్యాయులు కృష్ణారావు, మురళీధరరావు, వెంకటేశ్వర్లు, సక్రామ్, తిరుమలరావు, భాస్కర్, నాగేశ్వరరావు, నెహ్రూ, అశోక్‌కుమార్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

దాసాంజనేయ స్వామి ఆలయంలో..



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: వైరా రిజర్వాయర్ సమీపంలో గల దాసాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి నాగి, పాదిల హరినాథ్, దార్న రాజశేఖర్, మండల నాయకులు బోళ్ల గంగారావు, కొమ్మూరి శ్రీనివాసరావు, చెరుకూరి కిరణ్, పాలేటి నరసింహారావు, పమ్మి అశోక్, పుష్పలత, శ్రీదర్, శ్రీను, బిక్యా, గోపి, శరత్ చౌదరి, తేజావత్ స్వామి, మున్నా యాదవ్ పాల్గొన్నారు.

విశ్వధర్మక్షేత్రంలో..

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడు గ్రామంలో ప్రముఖ ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలోని శ్రీవిశ్వధర్మక్షేత్రం ప్రతిష్ఠ మహోత్సవ పూజలు రెండో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, యంత్రానుష్టానములు, వాస్తు హోమం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు తియ్యబిండి కల్యాణ్‌కుమార్ ఆచార్యులు, అత్తలూరి బాలశంకర్‌శాస్త్రి, నాగేశ్వరశర్మ, తుమ్మూరి శ్రీరాం ప్రసాద్, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

గార్లఒడ్డు దేవాలయంలో..

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని టీఎస్టీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

మల్లు వెంకటేశ్వర్లకు పలువురి నివాళి



వెంకటేశ్వర్లు స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు ఆయుష్ శాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్ మల్లు వెంకటేశ్వర్లు మృతికి పలువురు నివాళులు అర్పించారు. ఆదివారం మల్లు వెంకటేశ్వర్లు దశదిన కర్మ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు పాల్గొని నివాళులు అర్పించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఢిల్లీలో తెలంగాణ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, నివాళులర్పించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో నిర్మించిన మల్లు వెంకటేశ్వర్లు స్మారక స్తూపం వద్ద మొక్కులు నాటి ఆయుష్ శాఖలో వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న అప్పారావు

చింతకాని: సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ కార్మికులందరూ సంఘటితం కావాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సభ్యులు దేశబోయిన కొండలరావు, నానయ్య, రాంప్రకాష్, యశోద, జయరాజు, పట్టాభి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక..

చింతకానిలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తాళ్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కమల, ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్, సహాయ కార్యదర్శి వీరభద్రం, ఆర్గనైజింగ్ సెక్రటరి ఫణిరాజు, సభ్యుడిగా గోపి, షేక్ బాషా సాహెబ్, కొండలరావు, సలహా కమిటీ సభ్యులుగా సుధాకర్, శంకర్, రేళ్ల గోపి ఎన్నికయ్యారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టాపురం తండాలో ఆదివారం బంజారా సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్‌గురు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్‌లు హాజరై సత్‌గురు సేవాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్ పరిధిలోని గండగలపాడు, లక్ష్మీపురం, ముసలిమడుగు, కొండకొడిమ, ఖానాపురం గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ, విద్యుత్ స్తంభాల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం, ఎర్రుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు దృష్ట్యా సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈఈ జి.అనూష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియామకం పట్ల హర్షం



కె.శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న ఖాదర్‌బాబా

సత్తుపల్లి: ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస రెడ్డి నియామకం పట్ల టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్‌కె ఖాదర్ బాబా ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు, సీనియర్ పాత్రికేయులు బీవీ రామారావు, తడికమళ్ల దేవదానం, చక్రపు త్రిమూర్తులు, అయ్యప్ప, సతీష్, నిమ్మగడ్డ శ్రీకాంత్, ఎస్‌కె యాకూబ్, కె.గురవయ్య, రామకృష్ణ, మునీర్, రాము, సుధాకర్, రాజు, కృష్ణ, చందు, విష్ణు, ఫజల్, మీరా, అరుణ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన షేక్ జానిమియా (60) అను వృద్ధుడు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్యం సేవించిన ఇంటికి వచ్చిన జానిమియాను భార్య మందలించటంతో ఈ నెల 11న పురుగుల మందు తాగాడు. దీనితో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు గౌస్ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసి అండగా ఉంటామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక మెట్టాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన పట్టణ ఫుట్‌పాత్ వ్యాపారుల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించడానికి బ్యాంకర్లతో మాట్లాడతామని, రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు పథకాలు ఒకదాని తర్వాత ఒకటి అందరికీ అన్ని ఫలాలు అందుతాయన్నారు. త్వరలో రేషన్‌కార్డులు వస్తాయని తెలిపారు. జిల్లాకు ఏ నిధులు వచ్చినా సత్తుపల్లికి ప్రాధాన్యత ఇస్తున్న జిల్లా మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సంయమనంతో ఫుట్‌పాత్ వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, కంభంపాటి సత్యనారాయణ, ఎస్సై రాజు, చీపు రామారావు, ప్రభాకర్, రంజాన్‌బీ, వెంకమ్మ, రామలక్ష్మి, మధుబాబు, కుమారి, రాంబాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



బోనకల్: మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

బోనకల్/కారేపల్లి: పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బి.మంగీలాల్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం బోనకల్‌లోని ముష్టికుంట్లలో నిర్వహించిన సంఘ సమావేశం, కారేపల్లిలోని విశ్వనాథపల్లిలో కేవీ కృష్ణారావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని, పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా పర్యవేక్షణ అధికారులను నియమించాలని కోరారు. విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు నిర్వహించాలని, గురుకుల ఉపాధ్యాయులకు ప్యారిటీ స్కేల్స్ ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కేజీబీవీ ఉపాధ్యాయులకు ప్రతినెల మొదటి తేదీన జీతం ఇవ్వాలని, పాఠశాలలో ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి నాగేశ్వరరావు, ఉద్దండ్, షరీఫ్, గుగులోత్ రామకృష్ణ, అప్పారావు, మండల కమిటీ సభ్యులు సూర్య, నాగేశ్వరరావు, నాగలక్ష్మి, శిరీష, రామారావు, భాస్కర్, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



రామలింగేశ్వర స్వామి ఆలయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 3.20 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆదివారం దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం పురాతన ప్రాముఖ్యత కలిగి ఉంది. ఇక్కడ ప్రతి ఏటా మహాశివరాత్రి జాతర వేడుకలు ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యాన భట్టి విక్రమార్క ఇటీవల ఎండోమెంటల్ కమిషనర్‌ను ఆలయ అభివృద్ధికి కావాల్సిన నిధులను ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని ఆదేశించడంతో.. అధికారులు నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో ఆలయం ప్రహారీ నిర్మాణానికి రూ.50 లక్షలు, అభిషేక మండప నిర్మాణానికి రూ.50లక్షలు, ఆలయం ఆరు బయట వేదిక నిర్మాణానికి రూ.20 లక్షలు, రెండు డార్మెట్రీ హాల్-1 నిర్మాణానికి రూ.50 లక్షలు, డార్మెట్రీ హాల్-2 కొరకు రూ.50 లక్షలు అలాగే ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్నానాపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం కొరకు రూ.50 లక్షలు, విశ్రాంతి గదుల నిర్మాణానికి రూ.50 లక్షలు పనులు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ హరిచంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కను, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న లంకా కొండయ్య

మధిర: మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో సామాజిక సేవకులు(లంకా సేవ ఫౌండేషన్ నిర్వాహకులు) లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్‌కు ఆదివారం పలువురు దాతలు పాత దుస్తులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ.. అనేకమంది గృహాల్లో అవసరానికి మించి దుస్తులు ఉంటాయన్నారు. వాటిని సేకరించి మహాత్మా ఓల్డ్ క్లాత్ బ్యాంకు ద్వారా పేదలకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనేకమంది నివాసాల్లో అదనంగా ఉన్న దుస్తులను మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకుకు వితరణగా అందించినట్లు తెలిపారు. ఈ దుస్తులను వలస కూలీలకు, పేద కుటుంబాలకు అందించనున్నట్లు లంకా కొండయ్య వివరించారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో అదనంగా ఉన్న దుస్తులు, ఉపయోగంలో లేని దుస్తులు ఓల్డ్ క్లాత్ బ్యాంక్‌కు అందిస్తే అవి మరొకరికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెం గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు జక్కుల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆదివారం తొడితలగూడెం గ్రామంలో ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు (డీవీ)లు హాజరై వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ, నాగిరెడ్డి, నామా సుధాకర్, రామచందర్, సింగరేణి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, బండారి మోహన్‌రావు, ఎట్టి బాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శీలం వెంకటరెడ్డి

మధిర: మడుపల్లిలో ప్రభుత్వ, ప్రైవేట్ మాథ్స్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా మాథ్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో మధిర పట్టణానికి చెందిన భరత్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో అనీల్, ఉజ్వల్, అనూష, బిందు, లిఖిత ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు సాధించినట్లు భారత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు, ఉమ, డీన్ రవీందర్ రెడ్డి, స్రవంతి పాల్గొన్నారు.

దెందుకూరు విద్యార్థులు..

మెగా మాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. టాప్ టెన్‌లో నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎస్.తరుణ్ రెండో ర్యాంక్, దోర్నాల భార్గవ్ మూడో ర్యాంకు సాధించగా వారికి ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు మెమొంటోలు అందజేశారు. అదేవిధంగా సందీప్ ఎస్‌కె సమీర్, ఆర్ నాగబాబు ఉత్తమ ప్రతిభను చాటారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మువ్వా వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రభాకర్, గ్రామ మాజీ సర్పంచ్ విజయశాంతి, సొసైటీ అధ్యక్షులు వెంకటకృష్ణ అభినందించారు.

గ్లోబల్ కాంటెస్ట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ..

మధిర: రామాయణం గ్లోబల్ కాంటెస్ట్ పోటీలను ప్రపంచ స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించగా ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన మేళ్లచెరువు పృథ్వీ కృష్ణ విజేతగా ఎంపికయ్యారు. హైదరాబాద్ శంషాబాద్‌లోని ముచ్చంతల్ శ్రీ రామానుజ చిన జీయర్ స్వామి ట్రస్ట్ వారు ఆన్‌లైన్‌లో రామాయణం గ్లోబల్ కాంటెస్ట్ పోటీలను గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఫైనల్ పోటీలకు నలుగురిని ఎంపిక చేయగా ఆదివారం ఆఫ్‌లైన్‌లో ముచ్చంతల్‌లో జరిగిన ఫైనల్ పోటీల్లో ఖమ్మం జిల్లా మధిరకు చెందిన మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, రాధ దంపతుల కుమారుడు పృథ్వీ కృష్ణ ప్రథమ బహుమతి సాధించారు. ప్రథమ బహుమతి కింద చినజీయర్ స్వామి చేతుల మీదుగా లక్ష రూపాయలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ఆర్యవైశ్య సంఘాలు ప్రత్యేకంగా అభినందించాయి.